# ప్రేమజ్వరం

శ్రీయుత ఆంజనేయ వరప్రసాద శర్మ నామధేయుడు ఒక డాక్టరు. వాడిని మేమంతా "అంజి" అని పిలుస్తూంటాం. వాడి ఆత్మీయులం కావడం వల్ల సార్థక నామధేయుడు అంజి.

అమ్మా, నాన్నకు ఏకైక పుత్రుడవటం వల్ల మెడిసిన్ చదివించా లనుకున్నారు. తల్లిలేని పిల్లవాణ్ణి పెంచి పెద్దచేసిన నాన్న చనిపోయే రోజుల్లో వాడిచేత "మమ" అన్పించి: (అంటే డాక్టరు కోర్సులో చేర్పించి) మరీ కన్నుమూశారు.

పితృవాక్య పరిపాలనా దురంధరుడైన అంజి కంకణం కట్టుకుని చేరాడు మెడిసిన్లో. అసలు చిన్ననాటినుంచి డాక్టరీ వృత్తిలో యెంతో హాయి, స్వేచ్ఛ వుందనుకునేవాడు.

---

ఆగస్టు '66 జయశ్రీలో ప్రచురితము

అంజి అంతరాంతరాల్లో ముఖ్యోద్దేశ్య మేమంటే డాక్టర్ కోర్సులో చేరితే తరచు ఆడపిల్లలతో పరిచయం వుంటుందని, తద్వారా నర్సులు, డాక్టర్ హడావిడిగా పలకరిస్తూ వుంటుంటే అనిర్వచనీయమైన ఆనందం పొందవచ్చనీ ఆశపడ్డాడు. పైగా వాడో పెద్ద ప్రేమపిపాసి. దానికితోడు కో-ఎడ్యుకేషన్లో వుండే బోలెడు ఆనందాన్ని బావుకు తినచ్చని అభిప్రాయ పడినమాట వాస్తవం.”

మెడిసిన్లో చేరబోయే ముందు అంజిలో విచిత్రమైన కోర్కెలు, వింత వింత వూహాలు హృదయంలో గూడుకట్టుకున్నాయి. కేవలం ఆడవాళ్ళ పరిచయభాగ్యం కోసమే మెడిసిన్లో చేరాడనుకున్నారు చాలామంది.

అతని మొదటి కోరిక ఏ టి.బి. రోగంతో నైనా ఆస్పత్రిలో ఓ సంవత్సరంపాటు గడపాలనీ, లేదా మతిస్థిరం తప్పి ఏ పిచ్చాసుపత్రిలో నైనా పదేళ్ళపాటు కాపురం చేయాలనీ కోరుకునేవాడు. అలా అనుకోవటంలో ముఖ్యోద్దేశ్య మేమిటంటే వ్యాధిగ్రస్తుడై మంచానపడి ఆస్పత్రి పాలైతే అందమైన లేడీ డాక్టర్సు, ఎందరో నర్సులు తన చుట్టూ వుంటారని—పది నిమిషాలకోమారు పలుకరిస్తుంటే తద్వారా తృప్తిపడవచ్చుననీ అనుకునేవాడు.

అతను చూచిన చాలా సినిమాల్లో, చదివిన కథల్లో నర్సులు, డాక్టర్లు పేషెంటును పది కళ్ళతో కనిపెట్టుకుని వుంటూ పట్టుమని పదినిముషాలైనా వ్యవధి లేకుండానే రోగిని అమాంతం నర్సుగాని, లేదా డాక్టరుగాని ప్రేమించటం వాడి కళ్ళబడ్డది.

అలాంటి కలలు కనే అంజి మెడిసిన్లో చేరాడు. హమ్మయ్య అనుకుని గట్టిగా గాలి పీల్చుకో నారంభించాడు. ఇంటిప్రక్క పిన్నిగారమ్మాయి వైదేహి అంజి అందం చూచి ప్రేమించమని వెంటబడితే "పో బాల పొమ్మికన్" అనేసి పోజు పెట్టేవాడు. అలాంటిహీరో మేనకోడలు సరళ మెడిసిన్ చదువుతోందని తెలిసి ప్రేమకోసం అర్థిస్తూ వెంటబడ నారంభించాడు.

ఐస్ఫ్రూట్‌లాగ సన్నగ, ఎర్రగ, నాజూగ్గ వుండేసరళ ఈ తోకస్వామిని చూచి నీకు ప్రేమేమిటి మామయ్యా అనేసి తాటాకులు కట్టింది. రెండో పక్షంగా మెడిసిన్లో చేరితేగాని ప్రేమించననటంతో ఎగిరి గంతేశాడు.

"ఖర్మ, తీరా చేరాక ప్రేమ వ్యవహారానికి సున్నా చుట్టింది. చాలక మొన్న మాలతితో ప్రాక్టికల్సు క్లాసులో జోక్ చేశావు. నిన్న డిసెక్షన్ అవర్‌లో నళినితో నవ్వుతూ మాట్లాడావు. అలాంటి చీప్‌లవ్ నాకు అఖ్ఖర్ లేద"ంటూ గేలి చేయ నారంభించింది సరళ.

తీరా మెడిసిన్లో చేరాక అంజి అనుకున్నదంతా తారుమారైంది. ఎవరిని ఎట్లా అర్థం చేసుకోవాలో తెలీలేదు. ప్రతివాళ్ళూ సోషల్‌గా చనువుగావుంటూ వచ్చారు. ఎవరిది అసలు ప్రేమో, ఎవరిది నకలు ప్రేమో అర్థంగాని అంజి తికమక పడసాగాడు.

'అహర్నిశం ప్రేమా మహే' అంటూ కాలికి బలపాలు కట్టుకుని ఆడపిల్లలవెంట తిరగటం, వారితో కాలక్షేపం చేయటం చివరకు ఓ 'హాబీ'గా తయారై కూర్చుంది.

కాలేజీనుండి అంజి బైటపడగానే- పార్లమెంటులోంచి బైటకొచ్చిన ప్రధానమంత్రి చుట్టూ పత్రికా విలేఖర్లు మూగినట్టు, అంజిచుట్టూ పదిమంది అమ్మాయిలు మూగి, 'సినిమాకు వెళ్దామని' ఒకరు, 'షాపింగుకు వెళ్దామని' మరొకరు ప్రాణం తీసేవారు. వారి పవిత్రమైన కోరికను మన్నించకపోతే వారి ప్రేమ తనకు ఎక్కడ దూరమవుతుందోనని వెంట బయల్దేరేవాడు.

మెడిసిన్లో చేరబోయేముందు ఏ ప్రేమ వాసనైతే గుభాళించి అంజి నాసికా పుటాలను అంటివుందో, తీరా చేరాక లేబరేటరీల్లోకొట్టే ఆసిడ్ వాసన్లకు అదే ప్రేమ సౌరభం వికసించినట్టు అనుభవాన్ని పొందేడు.

అబ్బిగాడు- అనగా అంజి సన్నిహితుల్లో ముఖ్యుడు 'ఒరే అంజీ నువ్వెంత అదృష్టవంతుడివిరా ?' అన్నాడొక రోజున.

"ఎందుకని ?-"

"తరతరాలుగా తిన్నా తరగిపోని ఆస్థి మీ నాన్న నీకిచ్చి వెళ్ళాడు. రోజుకో అమ్మాయిని ఎంచక్కా కార్లో కూర్చోబెట్టుకు తిప్పగలవు. అయినా మెడిసిన్లోవుండే డిమాండు మా కెక్కడుందోయి ?"

"ఏడిసినట్లేవుంది. నేను అట్లాగే అనుకునేవాడిని. తర్వాతగాని తెలిసిందిగాదు దూరపుకొండలు నునుపని."

'అదిగాదురా! నేనుచూడు. ఎన్నిరోజులుగా తపిస్తున్నాను ? మచ్చుకో అమ్మాయైనా నన్ను ప్రేమించిందీ ?'

'అబ్బా' ఎంత నిరాశ. అసలు మనం కావాలనుకుంటే ఛస్తే ఏ అమ్మాయిూ ప్రేమించదు సరికదా పేద్దపోజు పెట్టేస్తుంది అందుకని. ..."

"ఆఁ... అందుకని, ఆ చిట్కా ఏమిటో నాకూ చెప్పరా బ్రదర్ :—"

"చూడు అబ్బిగా, ప్రేమించేందుకు కొన్ని అర్హతలు కావాలి. అంటే మాంచి అప్టుడేట్ మోడల్ కారు, జేబునిండా మందుగుండుసామాను వగైరా వుండాలి."

"ఓస్, అంతేగదా! అవన్నీ నాకున్న క్వాలిఫికేషన్సే. మరి నా ఖర్మమిట్లా కాలిందేం ?"

"అంతటితో సరిపోదు. మాటచమత్కారం, మరికొందరికి అందం ప్రాధాన్యం. కొంతమంది కవిత్వం వ్రాసేవాళ్ళను ప్రేమిస్తారు. కాబట్టి నేచెప్పిన వాటిల్లో ఏక్వాలిఫికేషన్లు నీకున్నాయో ఆలోచించుకో."

'నాకున్నదల్లా సహృదయం'

"బోడిహృదయం ఎవడికావాలోయ్, అది అందరిదగ్గరా వుంది. ఎవరిదగ్గరాలేని దేదైనా నీవద్దుంటే చెప్పు."

"ఓవిషయం అడుగుతాను. మీా డాక్టర్లకు కోపం రాదుగదా ?"

"అడగవోయ్, కోపతాపాలను చంపుకుని ప్రేమను పెంచుకున్నవాడే డాక్టరు."

"అసలదే మీాదగ్గరలేదు. పైగా మీా డాక్టర్లకున్నంత నీటు, నిక్కు మరెవ్వరికీ వుండదు.

"అదా చూడు. అసలు మెడిసన్ అనే మాటలోనే వుంది అంత అహంభావం. ఇక మిగతావి వ్యక్తిగతమైన వివరాలు" అన్నాడు అంజి.

ఆ విధంగా బాతాఖానీలో పడిన అంజి, అబ్బిగాడు ఓ గంటసేపు చర్చించుకుని ఆ నాటి కొలువు చాలించారు.

ఇంతకూ అసలు కథలో కొద్దాం—

మెడిసిన్ పూర్తి చేసి ప్రాక్టీస్ పెట్టినా సరళ మాత్రం అంజిని ప్రేమించి పెళ్ళిచేసుకోనేందుకు సుతరాము ఇష్టపడ లేదు. ఏ ఆశతోనైతే మెడిసిన్లోచేరి ప్రేమ - ప్రేమ అంటూ కలవరించి నిత్యం సరళ వెంట తిరుగుతూ అర్థించాడో ఆ సరళే తనను కాదన్నందుకు ఎంతో నిరుత్సాహపడ్డాడు అంజి.

ఓ రోజున సూటిగా అడిగేశాడు "నా ప్రేమ వ్యవహారం ఏం చేశావు" అని. సమాధానంగా నవ్వేసి వూరుకుంది సరళ. తరువాత నాలుగు రోజులుగా సరళ తనకు కన్పించలేదు. అంజికి పిచ్చెత్తినట్లయింది. వెళ్ళి చూసివద్దామనుకుంటే పేషెంట్ల హడావుడితో తీరిక చిక్కిందిగాదు.

ఉదయం ఎనిమిది గంటల సమయం. అంజి డిస్పెన్సరీకి వెళ్ళబోయే ప్రయత్నంలో వున్నాడు. పదేళ్ళ కుర్రాడు పరుగెత్తుకుంటూవచ్చి "సార్ అంజి డాక్టరుగారు మీరేనా?" అడిగాడు.

'అవును. ఏం గావాలి?'

'మరే ఈ చీటీ మీ కిమ్మన్నారు' అనేసి ఓలెటరు చేతికిచ్చాడు. వుత్తరాన్ని సాంతం చదివిన అంజి సరంజామా వెంటేసుకుని కార్లో కుర్రాడితోసహా బయల్దేరాడు.

కారు ఓ బంగళాముందు ఆగింది. వాకిట్లోనే ఎదురైన జానికమ్మ 'ఏరా అంజి! బొత్తిగా యింటివైపే రావటంలేదు' అంది.

"మరేం లేదక్కా, తీరుబడిలేదు."

"అవున్లేరా, అదే నీసొంత అక్కయ్యనే అయితే రాకుండా వుండగలిగే వాడివా? పోనీ సరళ కోసమైనా రావచ్చుగా—"

అక్కయ్య మాటల్లో శ్లేషార్థాన్ని అవగాహనం చేసుకున్న అంజి "సరళ ఏది? ఇంట్లోలేదా?-" అడిగాడు.

"లేకేం, నాలుగు రోజులునుంచి లేవటం లేదు. జ్వరం కూడా వస్తోంది. ఇన్నాళ్ళు స్వంత వైద్యమే చేసుకుంది. ఇవాళ నీ కోసం కబురంపమంది."

సరళ గదిలో కొచ్చిన అంజి పక్కనేవున్న కుర్చీలో కూర్చున్నాడు. ఏదో పేపరు చదువుకుంటోంది సరళ.

"ఏం సరళా, పడుకున్నావేం?-"

"అమ్మ చెప్పలేదా మామయ్యా!"

"లేదే. ఏం వంట్లో బాగోలేదా? తెలీనట్టు అడుగుతూ పల్సు చూడ నారంభించేడు."

"ఇది ఎన్నాళ్ళనుం చేమిటి?"

"మొదట మామూలు జ్వరమేమో అనుకున్నాను. కానీ ఈరోజు నాకెందుకో భయం వేసింది. అందుకే నీకోసం కబురంపాను" కళ్ళల్లోకి అదోలా చూస్తూ అంది.

"పోన్లే. ఇప్పటికైనా గుర్తుకొచ్చి కావల్సి వచ్చాను" నిష్ఠూరంగా అన్నాడు.

"మామయ్యా! ఇంతకూ జ్వరం ఏమిటంటావ్ ?-"

ఓ క్షణం సేపు ఆలోచించి "నాకూ అదే అర్థం కాకుండా వుంది. అయినా ఏం భయం లేదు. మరి ఫీజు ఏమాత్రం ఇచ్చుకోగలవేం ?-"

"జ్వరం తగ్గనీ, తర్వాత ఫీజు."

"ఆ పప్పులేం వుడకవ్. ప్రేమ జ్వరం ఫీజు ముందు ఇవ్వందే తగ్గదు. ఇప్పటికైనా నన్ను ప్రేమించేందుకు ఒప్పుకుని నీ హృదయం నాకు ఫీజుగా ఇస్తే, నీ జ్వరం ఇట్టే నయం చేస్తాను—నా ధ్యేయం నీకు తెల్సుగా."

"అహర్నిశం ప్రేమా మహే! అంతేగా."

అంజి కళ్ళల్లోకి సరళ ప్రేమతో చూడ్డం ఇదే మొదటి సారి.